విషపురుగులతో భద్రం సుమా!

- వర్షాలతో అన్నిచోట్లా పరుచుకున్న పచ్చదనం
- రాత్రివేళల్లో జాగ్రత్తలు తీసుకోవడం మంచిది
- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు నిమగ్నం





రాయచోటి జగదాంబసెంటర్ : వర్షాకాలం ప్రారంభంతో అన్ని ప్రాంతాలూ పచ్చదనంతో నిండాయి. బీడు భూములు, అటవీ ప్రాంతాల్లో కూడా మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనం పరిచినట్లు కనిపిస్తోంది. దీంతో పాములు, విష పురుగులు విచ్చలవిడిగా సంచరిస్తుంటాయి. ఈ సమయంలోనే కుంటలు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు, గడ్డివాములు, పేర్చిన కట్టెలు, ఇటుకలు వంటి ఇతరత్రా చోట్ల ఆవాసంగా విషపురుగులు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండేవారు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా విషపురుగులు, పాము కాటుకు గురయ్యే అవకాశం లేకపోలేదు.

ఆహారం కోసం బయటకు..

వర్షాకాలం కావడంతో ముఖ్యంగా కప్పలు ఎక్కువగా బయటకు వస్తుంటాయి. వాటితో పాటు బల్లులు, ఎలుకలు, తొండలనుపాములు వేటాడుతుంటాయి. కుంటలు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు, గడ్డివాములు, పేర్చిన కట్టెలు, ఇటుకలు ఇతరత్రా ప్రదేశాలలో విషపురుగులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కూడా పాముకాటుతో ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. రాయచోటి ప్రాంతంలో ఎక్కువగా కట్ల పాము, తాచుపాము, రక్తపింజర వంటి విషపూరిత పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఒకవేళ ఎవరైనా పాముకాటుకు గురైతే సరైన సమయానికి వైద్యం అందకపోతే ఒక్కోసారి ప్రాణాలు సైతం పోగొట్టుకోవాల్సిందే.

పాముకాటు ఇలా..

పాములకు చెవులు లేవ్పటికీ వాటి శరీరం కింద భాగంలో ఉండే ప్రత్యేక పొలుసులు ద్వారా శబ్ద ప్రకంపలను గ్రహిస్తాయి. వేడి రక్తం ప్రవహించే జంతువులు, మనుషులు సమీపంలోకి వచ్చినప్పుడు అవి వెంటనే వాటిని గుర్తించి కాటు వేస్తాయి. పాములు ఏకాంతానికి భంగం కలిగినప్పుడు లేక ప్రాణభయం ఉన్నప్పుడు, ఎవరైనా అకస్మాత్తుగా తొక్కినప్పుడు మాత్రమే అవి కాలు వేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం విషపురుగులు, పాములు ఇతరత్రా ప్రాణాంతక క్రిమి, కీటకాలు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అవి కాటు వేసే ప్రమాదం లేకపోలేదు. వర్షాకాలంలో ఎక్కువ శాతం రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉంటూ పాముకాటుకు గురయ్యే ప్రమాదాలు ఎక్కువ శాతం కనిపిస్తుంటాయి. వర్షాకాలంలో పాములు కూడా ఎక్కువగా గుడ్లతో పొదిగి పిల్లలు చేసే సమయం కూడా. కప్పలు కూడా బయటకు వచ్చే సమయం కావడంతో వాటిని వేటాడేందుకు పాములు విపరీతంగా సంచరిస్తుంటాయి. పొలం గట్లు, అటవీ ప్రాంతాలు, పొదల్లో ఎక్కువగా తిరుగుతుంటాయి.

జాగ్రత్తలు తప్పనిసరి

గ్రామీణ ప్రాంతాల్లో రాత్రివేళల్లో తిరిగే వారితో పాటు పొలాల దగ్గర నిద్రించే రైతులు, కూలీలు మాత్రం వెంట టార్చ్‌లైట్ ఉంచుకోవాలి. ఉన్న ప్రదేశాలను రోజూ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి పాములు కిరోసిన్, పెట్రోల్, డీజిల్ వంటి వాసన భరించలేవు. ఎక్కువగా ఉన్నచోట వీటిని ఉపయోగిస్తే మరీ మంచిది. రైతులు, కూలీలు రాత్రి వేళల్లో తిరిగేటప్పుడు కూడా మోకాళ్ల వరకు రబ్బరు బూట్లు వేసుకోవడం ఉత్తమం. గడ్డి పనిచేసే వారు చేతికి రబ్బరు తొడుగులు తొడుక్కోవాలి. ప్రతి ఒక్కరూ కూడా ఇళ్ల చుట్టుపక్కల పొదలు లేకుండా చూసుకోవడం మంచిది.

ప్రథమ చికిత్స ఇలా చేసుకోవాలి

- పాము కాటు వేసిన పై భాగంలో వెంటనే రక్త ప్రసరణ జరగకుండా బిగించి తాడుతో కట్టాలి. కాటు వేసిన శరీర భాగంలో బ్లేడుతో గాయం చేసి రక్తం కారనివ్వాలి.
- పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకుండా ఉండాలి. పక్కన వ్యక్తి ఉంటే బాధితుడికి ధైర్యం చెప్పేందుకు ప్రయత్నించాలి.
- కాటు వేసిన పాము అంతకు ముందు ఆహారం తిన్నా మరో జీవికి కాటు వేసిన విషం తీవ్రత తక్కువగా ఉండేందుకు అవకాశం ఉంటుంది.
- పాముకాటు వేసిన వ్యక్తికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆహారం ఇవ్వకూడదు. నడిపించడంతో పాటు పరిగెత్తించకూడదు.
- నాటు మందు, మాత్రలు అని కాలయాపన చేయకుండా వెంటనే దగ్గరల్లోని వైద్యశాలకు తరలించాలి.
- పాముకాటుకు గురైన వ్యక్తిని నిద్రపోకుండా చూసుకుని, కదలించకుండా ఆసుపత్రికి చేర్చాలి.
- ఇలా చేయడం వల్ల ప్రమాదం నుంచి బయటపడేందుకు అవకాశం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు.

భయపడాల్సిన అవసరం లేదు



పాముకాటుకు గురైన వ్యక్తి భయపడాల్సిన అవసరం లేదు. ఆలస్యం చేయకుండా దగ్గరలోని ఆసుపత్రికి తీసుకురావాలి. పాము కాటుకు గురైన వ్యక్తి ధైర్యం కోల్పోకుండా చూసుకోవాలి. ఆసుపత్రికి చేరిన తర్వాత విషయాన్ని వైద్యులకు తెలియజేయాలి. విషపూరిత పాము కాటు వేసినట్లు నిర్ధారించుకున్న తర్వాతనే విరుగుడు కోసం యాంటీ స్నేక్ వినమ్ మందును కాటు వేసిన వ్యక్తికి ఇవ్వడం జరుగుతుంది. ప్రస్తుతం ఈ మందు సీహెచ్‌సీలో అందుబాటులో ఉంది.

– డాక్టర్ రమేష్, పశువైద్యాధికారి, చిన్నమండెం

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన వైస్ ఎంపీపీ



వైఎస్ జగన్‌ను కలిసిన గౌరీశంకర్‌రాజు

ఓబులవారిపల్లి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని విజయవాడ క్యాంపు కార్యాలయంలో మంగళవారం వైస్ ఎంపీపీ గూడూరు గౌరీ శంకర్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ నాయకత్వంలో ఆయన ఆదేశాలు పాటిస్తూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

రాజంపేటలో ఎన్‌ఎంయూ ధర్నా



డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూ నేతలు

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ డిపో గ్యారేజి ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ ధర్నా మంగళవారం నిర్వహించారు. డిపో కార్యదర్శి రమణ, రాజంపేట తాలుకా జేఏసీ చైర్మన్ శెట్టం వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ ధర్నా కొనసాగింది. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి రమణ మాట్లాడుతూ వెంటనే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వేతన సంఘం ఆగిపోయిందని, వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. గవర్నర్ పేట డిపో–2 స్థలాన్ని లీజుకు ఇచ్చి జీఓను ఉపసంహరించుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను చెల్లించాలని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న 8వేలు పోస్టులను భర్తీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ డిపో కమిటీ, గ్యారేజీ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐడీ కార్డులు, టై, బ్యాడ్జీలు పంపిణీ



దళవాయిపల్లి పాఠశాలలో విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మండల విద్యాశాఖ అధికారులు చక్రాధర్, తిరుమలరావు విద్యార్థులకు గుర్తింపు కార్డులు, టై, బ్యాడ్జెస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం ప్రశంసనీయమని, ఇందులో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి ఎనలేనిదన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు గుర్తింపు కార్డులు విద్యార్థులకు అందించడం జరిగిందన్నారు.

పాఠశాలకు జారుడుబల్ల వితరణ



అంగన్వాడీ కేంద్రానికి జారుడు బల్ల అందిస్తున్న దాత

సుండుపల్లె : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో గల అంగన్వాడీ కేంద్రానికి మానవత సంస్థ డైరెక్టర్ రవీంద్రనాథ రెడ్డి మంగళవారం జారుడుబల్లను వితరణ చేశారు. చిన్నపిల్లలు ఆటలతో ఉత్సాహంగా అంగన్వాడీ పాఠశాలకు వచ్చేందుకు దోహదపడుతుందని ఎంఈఓ రవీంద్రనాయక్ తెలిపారు. కార్యక్రమంలో మానవత కార్యదర్శి నరసింహ, నారాయణనాయక్, సుధాకర్‌రెడ్డి, రజిని, ప్రకాష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని ప్రభుత్వాలు కాపాడాలి



జెండాను ఎగురవేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని దివ్యతేజ పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆ పాఠశాల డైరెక్టర్ నాగేశ్వరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కోటేశ్వర్రావు జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను కాలరాసే జీఓలను రద్దు చేయలని డిమాండ్ చేశారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేస్తోందని ఆరోపించారు. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కోసం అనేక రకాల షరతులతో అర్హత కలిగిన వారికి ఇవ్వకుండా చేస్తోందని ఆరోపించారు. అలాగే హాస్టల్ విద్యార్థులకు వసతులు కల్పించడంతో విఫలం అయ్యిందని విమర్శించారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీఓ 77తోపాటు జీఓ 107, 108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు



మంచినీటిని పట్టుకుంటున్న ప్రజలు

వీరబల్లి : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి నిధులతో ప్రజల సౌకర్యార్థం ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో శుద్ధి చేసిన నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి ఎంపీ మిథున్‌రెడ్డికి సమస్యను గతంలో తెలియజేయగా నిధులు కేటాయించారు. మంగళవారం వాటర్ ప్లాంట్‌ను ఎంపీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ప్రజలకు ఈ ప్లాంట్ ద్వారా తాగునీటిని అందించడం జరుగుతుందని ఎంపీపీ తెలియజేశారు.

విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్త

రాయచోటి టౌన్ : గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉంటుందని విద్యుత్ స్తంభాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయచోటి విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక వేళ విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరా అవుతున్నట్లు అ నిపిస్తే అటుగా వెళ్లకుండా ఉండటంతో పాటు అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ నెల 17వ తేదీ వరకు అప్రమత్తతతోనే ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య వచ్చిన వెంటనే 9440817449కు ఫోన్ చేయాలని తెలియజేశారు.

గ్రంథాలయ పితామహుడికి ఘన నివాళి



నందలూరు : డాక్టర్ రంగనాథ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

నందలూరు/వీరబల్లి : గ్రంథాలయాల అవసరాన్ని గుర్తించి వాటిని ఏర్పాటు చేసేలా డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథ్ చేసిన పోరాటం అనిర్వచనీయమని గ్రంథాలయ అధికారులు తెలిపారు. మంగళవారం ఆయన జయంతి సందర్భంగా రంగనాథ్ చిత్రపటానికి వీరబల్లి, నందలూరు మండల కేంద్రాల్లోని గ్రంథాలయాల్లో అధికారులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయ శాస్త్రంలో డాక్టర్ ఏఎస్ఆర్ రంగనాథ్ అగ్రగామి అని కొనియాడారు. ఆయన చేసిన గ్రంథాలయ ఉద్యమం వల్లే గ్రంథాలయాలు ఎంతో మంది మేధావులను అందించిందన్నారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నందలూరులో గ్రంధాలయ అధికారి రవిశంకర్‌రాజు, మంటి మారయ్య, రాజు, రవి, మునెయ్య, వీరబల్లిలో గ్రంథాలయ అధికారిణి విజయలక్ష్మీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవా భావాన్ని అలవరుచుకోవాలి



ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ తదితరులు

చిట్వేలి : అందరూ సేవాభావాన్ని అలవరుచుకోవాలని చిట్వేలి తహసీల్దార్ స్పందన పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ (సీహెచ్ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అన్నదానం, మంచినీరు, ఫ్రిడ్జితో ఉన్న వితరణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం సీహెచ్ఎస్ సంస్థ సమకూర్చిన ఆహార పొట్లాలను తహసీల్దార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్పందన మాట్లాడుతూ సేవ చేయాలంటే గొప్ప మనస్సు ఉండాలని, స్థానికంగా సేవలు అందిస్తున్న సీహెచ్ఎస్, మానవతా సేవాసంస్థ బాధ్యులు, సభ్యులు అభినందనీయులన్నారు. సీహెచ్ఎస్ కార్యదర్శి గాడి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ విశేష దినాలలో అన్నదానం చేయదలచిన వారు పండుగలు, శుభ కార్యాలయ సందర్భంగా మిగిలిన ఆహారాన్ని ఫ్రిడ్జిలో నిల్వ ఉంచి అనాథుల ఆకలితీర్చడం కోసం ఫుడ్ బ్యాంక్, దాహార్థుల దాహం తీర్చడం కోసం ఫ్రిడ్జ్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మన్నూరు భాస్కర్ రెడ్డి, మానవత సేవాసంస్థ బాధ్యులు మునిరావు, సాయిరాం, సభ్యులు జానీ, సుధీర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, తిరుమల రెడ్డి, సురేంద్రరెడ్డి, సురేష్, శివ, రంగారెడ్డి, పెంచలయ్య, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటరెడ్డి, సాయి, అవినాష్, పంచాయతీ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

రాయచోటి టౌన్ : తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిద్దామని రాష్ట్ర ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాయచోటి ఆర్టీసీ డిపో ఎదురుగా నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోషియేషన్ నాయకులు గేట్ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన సమస్యలను పోరాటం ద్వారానే సాధించుకోవాలని చెప్పారు. ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గన్నవరం డిపోలో లులూ సంస్థకు వచ్చిన 4.5 ఎకరాల భూమి బదలాయింపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ అసోసియేషన్ ట్రెజరర్ దేవేంద్ర, ఉపాధ్యక్షులు డి. రాజశేఖర్, డీఈసీ రామకృష్ణ యాదవ్, ఎన్‌ఎంయూఏ రీజనల్ గౌరవ సలహాదారుడు ఆర్‌వీ గోపాల్, రీజనల్ ప్రెసిడెంట్ ఎంఎస్ రావు, నాయకులు రామాంజులు, డిపో అధ్యక్షుడు డీవీ సుబ్బయ్య, కార్యదర్శి డీఎస్ వాసులు, గ్యారేజ్ కార్యదర్శి మోహన్ రాజ తదితరులు పాల్గొన్నారు.

ఆవుల వేణుగోపాల్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు



ఆవుల వేణుగోపాల్‌రెడ్డి భౌతికాయం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, నాయకులు



అంతిమయాత్రలో భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

సంబేపల్లె : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, దేవపట్ల గ్రామ సర్పంచ్ ఆవుల వేణుగోపాల్‌రెడ్డి అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. వేణుగోపాల్‌రెడ్డిని చివరిసారిగా చూడటానికి వచ్చిన వారితో ఆవులవాండ్లపల్లె జనంతో కిక్కిరిసింది. ప్రజల మనిషిగా రాజకీయాల్లో పేరొందిన పెద్దాయన ఇకలేకపోవడంతో గ్రామస్తులు, అభిమానుల్లో శోకంతో నింపింది. ఆయన చివరి యాత్రలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

వేణుగోపాల్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

ఆవుల వేణుగోపాల్‌రెడ్డి ఆకస్మిక మృతి తీవ్రంగా కలచివేసిందని, అలానే వైఎస్ఆర్‌సీపీకి తీరనిలోటు అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి విచారణ వ్యక్తం చేశాడు. ఆవుల వేణుగోపాల్ రెడ్డి కుమారులు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, వారి సోదరులు హర్షవర్ధన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డిలను అమెరికా పర్యటనలో ఉన్న శ్రీకాంత్‌రెడ్డి ఫోన్ ద్వార పరామర్శించారు. అదే విధంగా వేణుగోపాల్‌రెడ్డి భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యేలు గడికోట మోహన్‌రెడ్డి, రమేశ్‌కుమార్ రెడ్డిలు నివాళులు అర్పించారు. ఆవుల వేణుగోపాల్ రెడ్డి అంత్యక్రియలలో మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి, దేశాయి తిప్పారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బాల సుబ్రమణ్యం, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దేవనాథరెడ్డి, రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనంద్ రెడ్డి, ఆర్‌టీసీ మాజీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, నాయకుడు చిదంబరంరెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, వైద్యులు బయారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతోనే సంతోషకర జీవితం

వీరబల్లి : వ్యక్తిత్వ వికాసంతో సంతోషకరమైన జీవితం గడపవచ్చని సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ దేరంగుల గణేష్ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌డీకెఆర్ డిగ్రీ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, డిజిటల్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ యుగంలో విద్య, ఉద్యోగం, రోజువారి జీవితంలో రాణించడానికి డిజిటల్ నైపుణ్యాలు చాలా అవసరమన్నారు. బ్రాండ్ అవగాహన పెంచుకోవడానికి, సామాజిక సేవలు పెంపొందించడానికి, పరిశ్రమల అభివృద్ధిలో డిజిటల్ సేవలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ సంపాదించుకుంటే అన్ని రంగాలలో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీటీ కళాశాలపై సమగ్ర విచారణకు డిమాండ్

మదనపల్లె : స్థానిక బీటీ కళాశాలలో జరుగుతున్న విషయాలపై లోతైన విచారణ చేపట్టి నిజాల నిగ్గుతేల్చాలని రాష్ట్ర విద్యార్థి జేఏసీ కార్యదర్శి వి.ఉత్తన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ కృష్ణ కలిశారు. కళాశాలలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ తొమ్మిది అంశాలపై విచారణకు ఆదేశించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు, కళాశాలకు మంజూరైన నిధులు, ఎన్ని బ్యాంకు ఖాతాలు నిర్వహిస్తున్నారు, వాటి వినియోగం తదితర అంశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టి.రాజా, సురేష్, శ్రావణ్, సుధీర్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితుల పట్ల చిన్నచూపు తగదు



ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

రాయచోటి టౌన్ : హెచ్‌ఐవీ బాధితుల పట్ల చిన్నచూపు తగదని డాక్టర్ రమేష్ బాబు అన్నారు. మంగళవారం రాయచోటి బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హైదర్ వలీ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నిర్మూలన, నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుఖ వ్యాధులపట్ల అవగాహన కలిగిండాలని చెప్పారు. అలాగే ఎయిడ్స్/హెచ్‌ఐవీ బాధితుల పట్ల చిన్నచూపు చూడరాదని సూచించారు. కార్యక్రమంలో డీసీఎస్ పివి ప్రసాద్, పిసి ఎస్ఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ జి.చెన్నారెడ్డి లింక్ వర్కర్ అల్లావలీ పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులకు లంచాలు డిమాండ్

గుర్రంకొండ : తమ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులు, గోకులం షెడ్ల నిర్మాణాల బిల్లులకు సంబంధించి ఉపాధి హామీ సిబ్బంది లంచాలు వసూలు చేశారంటూ సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు మహాత్మారెడ్డి సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ తిరుమలేష్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయానికి వెళ్లి లిఖిత పూర్వకంగా ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఏడాదికి గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం గత నెల 28వ తేదీ నుంచి తనిఖీలు నిర్వహించారన్నారు. తనిఖీలు ముగిసిన అనంతరం పంచాయతీ కస్బాలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించాల్సి ఉండగా మారుమూల గ్రామమైన బురుజుపల్లెలో డీఆర్పీ, టీఏ, ఫీల్డ్‌అసిస్టెంట్లు నిర్వహించారన్నారు. టి.రాచపల్లెలో గ్రామసభ జరిగితే ఎక్కడ వీరు చేసిన అవినీతి బయటపడుతుందోనని భయపడి ఇక్కడ సభ నిర్వహించలేదన్నారు. తన భార్య శ్రీదేవి పేరిట గతంలో గోకులం షెడ్డు మంజూరైందన్నారు. వీటి నిర్మాణాలకు సంబంధించి బిల్లులు చేయాలంటే తనకు రూ. 20 వేలు లంచం ఇవ్వాలంటూ టెక్నికల్ అసిస్టెంట్ డిమాండ్ చేశారన్నారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అవినీతి, అక్రమాలకు పాల్పడిన టీఏపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్: బైక్ ఢీకొని మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. గాలివీడు మండలం పందిగాని తాండాకు చెందిన బద్దె నాయక్, పుష్పవతి (43), దంపతులు మదనపల్లె పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ రింగ్ రోడ్డు వద్ద, నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో కాపలా పనులు చేస్తుంటారు. మంగళవారం మధ్యాహ్నం పుష్పవతి రోడ్డు దాటుతుండగా, అటువైపు నుంచి పట్టణంలోని గొల్లపల్లి సర్కిల్ కు చెందిన వెంకటేష్ కుమారుడు చిరంజీవి (34) బైక్ పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో పుష్పవతి తలకు తీవ్ర గాయం కాగా కుడికాలు విరిగింది. చిరంజీవి సైతం చేయి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పుష్పవతి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు



సిద్దవటం: ఆల్‌బెండజల్ మాత్రను మింగిస్తున్న వైద్య సిబ్బంది



పుల్లంపేట: నులిపురుగుల మందును తినిపిస్తున్న వైద్యులు



పెనగలూరు: విద్యార్థులకు నులిపురుగుల మందు వేస్తున్న డాక్టర్ తౌసిఫ్

సిద్దవటం/ పుల్లంపేట/ పెనగలూరు : నులి పురుగుల నివారణతోనే చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉండగలరని వైద్యాధికారులు పేర్కొన్నారు. మంగళవారం అన్ని మండలాల పరిధిలో విద్యార్థులకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 1–18 ఏళ్ల పిల్లలు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ నులి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మంగళవారం మాత్రలను మింగని వారికి ఈ నెల 21న మాత్రలను అందిస్తామని చెప్పారు. నులి పురుగుల ఉన్న వారిలో ఉండే లక్షణాలను వివరించారు. చేపట్టాల్సిన జాగ్రత్త చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించాలని పరిశుభ్రంగా లేకుంటే నులి పురుగుల నివారణ కష్టతరమని తెలియజేశారు. ఆయా కార్యక్రమాలలో వైద్యాధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మృతికి సంతాపం

కలికిరి : శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి(91) మృతికి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం తెలిపారు. చెంచురెడ్డి మృతి సమాచారంతో మంగళవారం ఉదయం శ్రీకాళహస్తిలోని వారి స్వగృహానికి చేరుకుని మాజీ ఎమ్మెల్యే భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.